
# ఇదే 'నా' వైద్యం



డాక్టర్ సందీప్‌గార్ని కలసిపదిరోజులైంది. వారితో అస్తమానం పనిలేకపోయినా స్నేహపూర్వకంగా కలవడం అలవాటు.

సాయంత్రం నాలుగైతే చాలు రోడ్డు మీద వున్న రెండు గదులు క్లినిక్ తలుపులు తెరచుకుంటాయి. దుమ్ము దులిపి అగరొత్తు వెలిగించి టోకెన్ నెంబర్లన్నీ వరుసగా పెట్టుకొని పేషెంట్ల రాకకోసం ఎదురు చూస్తుంటారు కాంపౌండర్.

డాక్టర్ సందీప్‌కి వైద్యవృత్తిలో పాతికేళ్ల అనుభవం రద్దీగా ఉన్న నగరంలో ఆ చివర ఈ చివర రెండు క్లినిక్స్ సారధ్యం వహిస్తున్నాడు. క్లినిక్‌కి డాక్టర్ ఎంత ఆలస్యంగా వచ్చినా అప్పటివరకు పేషెంట్స్ నిరీక్షిస్తూనే వుంటారు. నేను వెళ్లేసరికి కుర్చీలు, నాలుగు వైపు బల్లల నిండా పేషెంట్స్, వారితో తోడుగా వచ్చిన వారంతా కలసి రద్దీగా ఉంది.

కంపౌండర్‌ను కలసి చిన్న నవ్వు నవ్వి టోకెన్ తీసుకొని కొంచెం చోటున్న బల్లమీద సర్దుకొని కూర్చొని అందరివైపు పరికించి చూశాను.

ఒకొన్నొకరు సీరియస్‌గా చూసుకుంటూ, ఇక నిశ్శబ్దం భరించలేక సణుగుడు మొదలుపెట్టారు. ట్రీట్‌మెంట్‌కోసం వచ్చే పేషెంట్స్ అందరిలో ఓ దుర్గుణం వుంది. ఏ డాక్టరు దగ్గరకే వస్తారో అతడ్ని తప్పించి మిగతా డాక్టర్లపై తమ అక్కసంతా మాటల్లో చూపిస్తుంటారు.

శారీరక బాధలతో సతమతమైపోతున్నవారంతా వారివారి మానసిక వ్యధల్ని మరొకరితో పాలుపంచుకోవడంలో ఎంతో తృప్తి, ఉపశమనం పొందుతుంటారు. ఆటువంటి సంభాషణే మొదలైంది. " డాక్టర్ గారు తెలుసా మీకు" అంటూ మరొకరిని అడిగాడు ప్రక్కనున్నాయన.

" ఆ! ఇంతకు ముందు రెండుసార్లే వచ్చాను. మంచి మందులే రాస్తారు. అవి కూడా చేంతాడంత లిస్టు ఉండదు." అన్నాడాయన తృప్తిగా.

ఆ మాట ఎదురుగా కూర్చున్న వ్యక్తికి నచ్చలేదు.

"ఏ డాక్టరైనా మందులతో ప్రయోగాలు చేసేది మనమీదనే కదండి" అసహనంగా పలికాడు.

" బాగా చెప్పారు డాక్టర్ చేయివేస్తే చాలు వంద, రెండొందల కన్సల్టెన్సీ ఇచ్చుకోవాలి. అలా అని రోగాలు ముదరబెట్టుకోలేం కదా" నిరాశగా, నిర్లిప్తంగా అన్నాడు మరొకడు.

" ఫీజు మాటకే లెండి, స్కానింగ్ టెస్ట్‌లని మనల్ని పంపి లాబరేటరీ కమీషన్ కూడా లాగుతున్నారు. ఎటొచ్చి మనమే వట్టి చవటలం, చేతకానివాళ్ళం" అంటూ మనసులోని దుగ్ధనంతా వెళ్ళగక్కాడు ఒకాయన.

"మీకు చెబితే నమ్మరు కాని మొన్నీమధ్య సుస్తీ చేసి డాక్టర్ దగ్గరకెళితే లేని జబ్బుల్ని అంటగలిపి రెండు వేలు ఖర్చుపెట్టించాడు.

"ఆ మందుల షాపు ఆయన చుట్టానిదేనట." వెకిలిగా వ్యంగ్యంగా నవ్వుతూ చెప్పాడు.

" నిజమేలెండి, ఎవరినో ఒకర్ని నమ్ముకోవాలిగా, దాంతో మన ఓర్పుని, సహనాన్ని పరీక్షిస్తున్నారు." అంటూ మరొకరు అందరిలో గట్టి నమ్మకాన్ని కలిగించారు.

అంతలో ఆడవాళ్ళ గొంతు జత కలిసింది. కుతూహలంగా అంతా తలెత్తి చూశారు.

డెలివరీకని నర్సింగ్ హోమ్‌లో మా అమ్మాయిని చేర్పించాను. పెయిన్స్ అడ్వాన్సుగా వచ్చేసాయి. ఏం చేస్తాం? తీరా నార్మల్ డెలివరీ అయింది. ఆడపిల్ల పుట్టింది కాని సిజేరియన్ ఆపరేషన్ అని ఏదో చెప్పి పదివేలు బిల్లు కట్టమన్నారు. ఎంత అన్యాయమో చూశారు, ఎవర్ని అడుగుతాం అంతా మన కర్మ అని సరిపెట్టుకున్నాం." అంటూ ఎంతో నిస్పృహకు లోనై చెప్పింది ఒకామె.

"ఏం చేస్తాం, డబ్బు కోసం ఎంత నిర్ధయగా వ్యహరిస్తున్నారు, ఆభగవంతుడే మనల్ని కాపాడాలి." అని విచారం ప్రకటించింది పక్కనున్న ఆమె.

"అదే కదా ! పేషెంట్ వచ్చాడంటే చాలు సంపాదనాపరులా కాదా అని అంచనా వేస్తారు. ఇదో పెద్ద వ్యాపారం అయిపోయింది సుమండీ' విస్తుపోతూ నలుగురు వినేటట్లు అంది. అంతా తనని మెచ్చుకుంటున్నారా లేదా చూస్తూ.

అంతా ఎవరికి నచ్చే విధంగా వారు వారి హావభావాలు వ్యక్తపరుస్తూ కామెంట్స్ చేస్తూనే ఉన్నారు.

ఓ పక్కన ఒద్దికగా కూర్చొని శ్రద్ధగా వింటున్న నన్ను ఒకాయన కలుపుగోలుగా పలుకరిస్తూ "ఏమండి, మీరేం మాట్లాడడం లేదు. కొంపదీసి డాక్టర్ గారి తాలూకా " అని చురుగ్గా చురకఅంటించినట్లు ప్రశ్నించాడు.

నాకెక్కడో కాలి, బొబ్బలెక్కిందా అన్నట్లు తుళ్లి పడ్డాడు.

'అబ్బె! హి...హి... " అని నవ్వి "మీరు చెప్పినవన్నీ కరెక్టే కదండి, రోజూ చూస్తున్నాంకదా. కాని ఒక విషయం మాత్రం చెప్పాలి. ఈ డాక్టర్ గార్ని మాత్రం అందరితో పోల్చిచెప్పలేం. నాకు గత పదేళ్ళుగా ఉన్న పరిచయం మీద చెబుతున్నారు. వీరు గొప్ప అనుభవస్తులు. మంచి హస్తవాసి. పాతికేళ్లుగా జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తూ ఉన్నారు. ఆఫ్‌కోర్స్! డాక్టరన్నాక మరీ ఫీజు లేకుండా వైద్యం చేసే నారాయణడెవరున్నారు. డబ్బు గుంజినా జబ్బు నయం చేసి ఉపశమనం చేయగలిగితే చాలు. ప్రిస్క్రిప్షన్ వ్రాస్తూనే ఎడం చేత్తో చిటికెలు వేస్తాడీయన. పాతికేళ్లు గవర్నమెంట్ సర్వీసులో పది లక్షలు సంపాదించి ఉంటే ప్రైవేటు ప్రాక్టీసులో ఎన్నో కోట్లు కూడబెట్టేరు. ఇల్లే ఉంటుంది ఒక కోటి. అందిరిలా రసీదు లేకుండా ఇన్‌కమ్‌టాక్స్‌కి దొరకకుండా చలామణీ అవుతున్నారు. ఒక్కగానొక్క కూతురు పెళ్లి చేసి అమెరికా పంపించేసారు. అయినా డబ్బుమీద

యావపోలేదు. అదే నాకెంతో ఆశ్చర్యం వేస్తుంటుంది." అన్నాడు మధ్యతరగతి మనస్థత్వాన్నుండి దూరంగా పారిపోలేక అందరితో ఏకీభవిస్తూ..

" పేషెంట్లను పీడించి అంత డబ్బు ఏం చేసుకుంటారో" అంటూ మరొకాయన ఆసక్తిగా పలికాడు.

" ఇదేమాట నేనొకసారి అడిగాను దానికి డాక్టరు గారు ఏమన్నారో తెలుసా, 'అదేంటి అలా అంటారు. ట్రీట్‌మెంట్ ద్వారా ఎంత సేవ చేస్తున్నాను. ఫ్రీగా చేస్తే నన్నో చేతగాని దద్దమ్మ, బడుద్దాయిలా చూస్తారు ' అన్నాడాయన నిర్మొహమాటంగా తన దగ్గరకొచ్చిన పేషెంట్స్ అందరికీ బాగా స్టడీచేసినట్లు. అప్పుడు మళ్లీ అన్నాను. ' ఇలాగే రోజులు దొర్లిస్తే మీకిక మనశ్శాంతి ఎక్కడ దొరుకుతుంది సార్, వీలు చూసుకొని అలా పుణ్యక్షేత్రాలకు టూర్ చేసి రాకూడదా! రిలీఫ్ వుంటుంది కదా! అని కూడా చొరవ తీసుకొని సరదాగా చెబుతున్నట్లు చెప్పాను. దానికాయన చిద్విలాసంగా నవ్వుతూ ' మీకేం ఉద్యోగస్తులు ఉచిత సలహాలిస్తారు. లిమిటెడ్ అవర్స్ తరువాత మిమ్మల్నెవరూ అడగరు. అదే నేను ఏ గుడికో వెళ్ళాననుకోండి. కాలక్షేపం చేయవచ్చు. కాని నాకోసం పడిగాపులు పడే పేషెంట్స్ ఎంతోమంది ప్రాణాలు పొగొట్టుకుంటారు. దానికెవరు సమాధానం చెబుతారు? అని డాక్టరు గారు తిరిగి చిక్కుప్రశ్న వేసేసరికి ఇరకాటంలో పడ్డట్లు నానోట మాటరాలేదు. ఈయన తరహా యే వేరు. " అని డాక్టర్ సందీప్‌గార్ని బలపరుస్తూ ధీటుగా చెప్పాను. కాని అక్కడున్న ఒకరిద్దరికి నా మాటలు చేదుగులికల్లా అనిపించాయి. నాపై ధ్వజమెత్తినట్లు విజృంభించాడాయన.

" అయ్యా! మీరు చెప్పింది చాలు గాని, పొగడ్తలాపండి, వీరేనా ఏడాది పాటు ఉన్న ఉద్యోగానికి గైరు హాజరై, ఓ సూపర్ స్పెలాలిటీ ఆసుపత్రికి ఆ కేసులన్నీ రప్పించుకున్నారు. ఎవరికి తెలియదండి " అంటూ ఉక్రోషంతో తిరుగుబాటు బావుటా ఎత్తినట్లు విరుచుకుపడ్డాడు. నా నోటికి తాళం పడి గుటకలు మింగాను.

నేనూహించని పరిస్థితి ఎదురైంది. ఆయన చెప్పిన మాటల్లో నిజాన్ని ఖండించలేను. వ్యక్తిగత ఘర్షణలకు తావివ్వకూడదనుకున్నాను. ఏదో పని ఉన్న వాడిలా అక్కడ్నుంచి మెల్లగా లేచి అటూ ఇటూ చూసి కంపౌండర్ దగ్గరకెళ్లి " నాకు అర్జంటు పని ఉంది. డాక్టర్ గారు వచ్చేసరికి ఇంకా ఎంత టైమ్ అవుతుందో, మళ్లీ వస్తాను " అంటూ నా చేతిలో వున్న నెంబరు టోకెన్ టేబిల్ మీద పెట్టి వెనక్కి తిరిగి నడిచి వెళ్ళిపోయాను. ఆ తరువాత వరుసగా పది రోజులు ఆ క్లినిక్ వైపు వెళ్ళలేదు. ఒకరోజు వెళ్ళేసరికి "డాక్టరు

గారికి సుస్తీ చేయడం వలన ఈరోజు కూడా రారు" అని చెప్పాడు కంపౌండర్. ఆశ్చర్యం వేసింది. అయినా నా పిచ్చిగాని ఆయన కూడా ఒక మనిషేగా ఆ మాత్రం నలతచేయకుండా ఉంటుందా అనినాలో నేను సముదాయించుకున్నాను.

మరికొన్ని రోజులు గ్యాప్ఇచ్చి వెళ్ళాను. కంపౌండర్ ఎదురొచ్చి డాక్టరు గారు మరో పది రోజుల వరకు రారని, ముఖంలో ఏదో అవ్యక్తం గాని మూగబాధను వ్యధను దిగమింగుకుంటూ చెప్పేసరికి నా మనసు ఆందోళనతో నిండిపోయింది.

" మీకు తెలియదా డాక్టరు గారి మిసెస్ చనిపోయారు " అన్నాడు నావైపు తీక్షణంగా చూస్తూ.

తృళ్ళిపడ్డాను. నిజాన్ని నమ్మలేకపోయాను.

" అమ్మగారికి హార్ట్ ఎటాక్ వచ్చింది. అబ్జర్వేషన్‌లో పెట్టాక చాలావరకు తగ్గింది. ఇంట్లోనే ఇద్దరు హార్ట్ స్పెషలిస్టులని ట్రీట్‌మెంట్‌కి పెట్టారు. మరింక పరవాలేదు. గండం గడిచిందని సర్టిఫై చేశారు. ఆ ధీమాతోనే నిన్న కారులో షికారుకు వెళ్తామని బయలుదేరారు. గేటు దాటారో లేదో సెకెండ్ స్ట్రోక్ వచ్చి కారులోనే వాలిపోయారు."అంటూ కంపౌండర్ పూసగుచ్చినట్లు విపులంగా చెప్పేసరికి నా గుండెల్లో చెప్పనలవికాని బాధ, కళ్ళల్లో నీళ్లు, ఎంతో వత్తిడికి లోనయ్యాను.

ఈ విషమ పరిస్థితుల్ని, ఒంటరితనాన్ని దైనందిక జీవితాన్ని ఎలా సాగిస్తారా అని ఎంతో విచారించాను.

ఆ మరునాడు ఆ రోడ్డు వైపు చూస్తూ క్లినిక్ ముందుకొచ్చాను. అక్కడ డాక్టర్ గారి కారు కనిపించింది. నాలో ఆశ్చర్యం, ఆతృత కలిగింది. ఈ టైములో అది కూడా పది రోజుల వరకు రారనుకున్న డాక్టరు అప్పుడే క్లినిక్ రావడం ప్రజలపై సేవానిరతిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. అంతలోనే ఏదో తెలియని నిరసన బాధ మనసులో చోటుచేసుకున్నాయి. డాక్టర్ గారి సంకుచిత మనస్తత్వాన్ని ఛీదరించుకోకుండా ఉండలేకపోయాడు. కాని మానవతా దృష్టితో పరామర్శించవలసిన అవసరం ఉందని మెల్లగా నడిచి తొంగి చూశాను. ఎవరూ కనిపించలేదు. గోడ గడియారం తిరుగుతోంది. డాక్టరు గారితోపాటు మరో వ్యక్తి గొంతుక వినిపిస్తోంది. కర్టన్ సందుచేసి చూశాను. ఇద్దరు డాక్టర్లు మాట్లాడుకుంటున్నారు.

" మీకు చెప్పేటంతటి వాడిని కాదు డాక్టర్"

" డోండ్‌వర్రీ డాక్టర్ నాకంతా తెలుసు" అన్నారు సందీప్

" ఆ నెగ్లిజెన్స్ పనికిరాదు. మీరు పూర్తి బెడ్‌రెస్ట్ తీసుకోవాలి"

" నో, నో నాకంత తీరిక లేదు. ప్రాక్టీసుపోతుంది.

" అదేంటి డాక్టర్ మీరు బాగుంటేనే కదా ఏదన్నా, మెడికల్ రిపోర్టు చూసారుగా, లివర్స్ కంప్లీట్‌గా డామేజ్ అయిపోయాయి. ఇక ఎంతమాత్రం ఉపేక్షించడానికి వీల్లేదు"

" ఆ టైమొస్తే ఎవరూ ఆపలేరు. దానికోసం ప్రాక్టీసు మానేయమంటారా, ఈ రోజు నాకొక అర్జంటు ఆపరేషన్ ఉంది. ఏభై వేలు ఆఫర్ చేస్తున్నారు. పదండి వెళ్దాం. అయామ్ ఆల్‌రైట్. మిమ్మల్ని డ్రాప్ చేస్తాను. టైమవుతోంది" అంటూ డాక్టర్ సందీప్ ఉన్నపాటున లేచి బయలుదేరారు. వారి మాటలు విని ఖిన్నుడనయ్యాను. మనసంతా వికలమైపోయింది. అతి భయంకరమైన చిచ్చుని ఒంట్లో దాచుకొని ఏమీ కానివాడిలా చిరునవ్వు నటిస్తూ లక్షల కోసం ఆరోగ్యాన్ని లక్ష్యపెట్టకుండా తిరుగుతున్నా రేమిటి. ఈయన్ని ఎలా అర్థం చేసుకోవాలో నమ్మలేక ఆలోచించలేక మస్తిష్కం వేడెక్కింది.

డాక్టర్లు క్లినిక్ బైటికి రాకముందే నేను మెట్లు దిగి వెనుకవైపు కొచ్చి నిలబడ్డాను. అప్పటి వరకు శ్రద్ధాంజలి ఘటించాలనే ప్రయత్నం విరమించుకున్నాం. తలుపులు వేసి డాక్టర్లు ఇద్దరూ హడావిడిగా ఎస్టీమ్ కారు దగ్గరకెళ్లి స్టార్ట్ చేసి వెళ్లిపోయారు. నేను అక్కడ్నుంచి కదలబోయేసరికి ఎవరో తెలియని వ్యక్తి ఆటోలో దిగి పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను చూసి " ఏమండీ డాక్టరు గారు లేరా?" అంటూ ఆతృతగా అడిగాడు.

" లేరండి. ఇప్పుడే వెళ్ళిపోయారు. ఏం, దేనికి?" అని అతని హడావిడి చూసి అడిగాను.

" మా ఆవిడ చావుబతుకుల్లో ఉందిసార్. ఆపరేషన్ నిన్ననే జరగవలసింది. ఏభై వేలు చేతిలో పెడితే గాని ఆపరేషన్ చేయడం కుదరదన్నారు. తిరిగి తిరిగి ఎంతో ప్రయత్నిస్తే ఇప్పుడు చేతికి దొరికింది. డాక్టరు గారు ఎక్కడ దొరుకుతారో చెప్పండి ప్లీజ్ అంటూ ఎంతో బెంగ పడుతున్నట్లుగా అడిగాడు.

కొద్దిసేపటి క్రితం నేను విన్నది వీరి గురించే కాబోలు అనుకున్నాను. నర్సింగ్ హోమ్‌లో ఉంటారేమో చూద్దాం పదండి" అని అతనితో పాటు ఆటో ఎక్కి ఆసుపత్రికి చేరేసరికి ఎవరి కోసమైతే తిరుగుతున్నాడో ఆమె చనిపోయిందన్న వార్త చెవిని సోకింది. అతనితో

పాటు నేను కూడా నిశ్చేష్టుల మయ్యాం.

అనూహ్యమైన దుర్వార్త గుండెలను పిండేసినట్లయింది. అప్పటికే వచ్చి వెళ్లిపోయిన డాక్టర్ సందీప్ నిర్లక్ష్యం, నిరంకుశత్వం,వికృతరూపమై నా కళ్ళు ముందు తిరిగింది.

అక్కడే ఎదురుగా చనిపోయిన భార్య కోసం హృదయవిదారకంగా విలపిస్తున్న ఆయన జేబులో నుండి కరెన్సీ నోట్లు వెక్కిరిస్తున్నట్లుగా గాలికి రెపరెపలాడసాగాయి.

(మే, 2011)



కథాంజలి ఆవిష్కరణ సభలో ప్రముఖ కథా, నవలా రచయిత
శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు